క్లుప్తంగా

ఘనంగా లూథరన్ ఆలయ వార్షికోత్సవం

పొన్నెకల్లు(తాడికొండ): మండలంలోని పొన్నెకల్లు గ్రామంలోని పరిశుద్ధ త్రిత్వ లూథరన్ దేవాలయ తృతీయ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పాస్టర్ రెవరెండ్ నాదెండ్ల రాజమోహన్ ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట సర్పంచ్ నూకతోటి మేరిమ్మ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పేరేచర్లలో ముస్లిం మైనార్టీల సమావేశం

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల నరసరావుపేట రోడ్డులో హోటల్ రవీంద్రలో శనివారం సాయంత్రం మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ హబీబుల్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడికొండ నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీలందరూ కార్యక్రమంలో పాల్గొనాలని, పిలుపునిచ్చారు. కార్యక్రమానికి కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, వైఎస్సార్ సీపీ మైనార్టీ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా, ప్రముఖ సినీ నటుడు అలీ, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, జిల్లా కో ఆర్డినేటర్లు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పాల్గొంటారని తెలిపారు.

రాజధాని రైతుల ద్రోహి చంద్రబాబునాయుడే

తాడికొండ: రాజధాని రైతుల ద్రోహి చంద్రబాబు నాయుడేనని మంగళగిరికి చెందిన స్వయం ప్రకటిత రాజకీయ వ్యూహకర్త రాకేష్ కుమార్ పేర్కొన్నారు. అమరావతి శంకుస్థాపన ప్రాంతం ఉద్దండ రాయునిపాలెంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. అమరావతి రైతుల పాదయాత్ర వ్యూహానికి గతంలో తాను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా చంద్రబాబు బాగుందని చెప్పినట్లు తెలిపారు. అమరావతి ప్రాజెక్టు క్విడ్ ప్రోకో అని, బాబు భూములు మొత్తం కొట్టేశారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో సామాన్యులు కూడా నాయకులుగా ఎదిగారన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రజలందరికీ తెలిసేలా చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ప్రజల జీవితాలంటే క్రికెట్ అనుకున్నారా సూపర్ సిక్స్ అంటే ఎంటని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఎకరం రూ.4 కోట్లకు అమ్ముకుంది ప్రజలు కాదని, చంద్రబాబు, ఆయన అనుచరులేనని అందులో సామాన్యులు ఎవరూ లేరన్నారు.

తాడికొండలో ఆరు నామినేషన్ల తిరస్కరణ

తాడికొండ: తాడికొండ- 86వ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి శుక్రవారం నిర్వహించిన స్క్రూటినీలో ఆరుగురు అభ్యర్థుల నామినేషన్ పత్రాలను నిబంధనల ప్రకారం సమర్పించని కారణంగా తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు తెలిపారు. మొత్తం 16 మంది అభ్యర్థులు 23 సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు పరచగా పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి తాళ్ళూరి నాగరాజు నామినేషన్ పత్రాలలో పది మంది ఓటర్లు ప్రపోజ్ చేసి, సంతకం చేయాల్సి ఉండగా 9 మంది మాత్రమే సంతకాలు చేసి ఒకరు సంతకం చేయని కారణంగా తిరస్కరణకు గురైంది. కొప్పుల దివ్యవాణి, గొడవర్తి ప్రసన్న కుమార్, గంజి సుజని అనే ఇండిపెండెంట్ అభ్యర్థుల నామినేషన్లు ఫారం-26 అఫిడవిట్ అన్ని పేజీలు సంతకం చేయని కారణంగా తిరస్కరణకు గురాయ్యాయి. టీడీపీ నుంచి తెనాలి కాంతి సుమన్‌బాబు, వైఎస్సార్ సీపీ నుంచి మేకతోటి హర్షిత్ అభ్యర్థుల నామినేషన్లకు సంబంధించి ప్రధాన అభ్యర్థుల నామినేషన్లు అంగీకరించిన కారణంగా ప్రత్యామ్నాయ అభ్యర్థులైన వీరి నామినేషన్లు తిరస్కరించారు. దీంతో తాడికొండ నియోజకవర్గంలో పది మంది అభ్యర్థుల నామినేషన్‌లకు అంగీకరించినట్లు ఆర్వో గంగరాజు తెలిపారు. నామినేషన్ల ఉప సంహరణ ప్రక్రియకు 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉందని ఆయన తెలిపారు.

96 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం



తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డులో అక్రమంగా తరలిస్తున్న 96 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. వివరాల మేరకు.. పొన్నెకల్లు గ్రామానికి చెందిన సూర్రెడ్డి రామకృష్ణారెడ్డి 96 క్వార్టర్ మద్యం బాటిళ్లతో వెళ్తుండగా.. తాడికొండ అడ్డరోడ్డులో పట్టుకొని ఠాణాకు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం, నగదు పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే తన ఫోన్ నంబరు 86888 31374 నంబరుకు నేరుగా సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

మంగళగిరి గడ్డ.. వైఎస్సార్ సీపీ అడ్డా

- సంక్షేమం, అభివృద్ధే మా లక్ష్యం
- ఇంటివద్దకే పరిపాలన ధ్యేయం
- మరోసారి ఫ్యాను గుర్తుకు ఓటు వేయండి
- వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు అఖండ మెజార్టీ ఇవ్వండి
- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే, అభ్యర్థి లావణ్య



ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థి లావణ్య, ఎమ్మెల్సీ మురుగుడు, ఎమ్మెల్యే ఆర్కే తదితరులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి గడ్డ వైఎస్సార్ సీపీ అడ్డా అని, మరోసారి ఫ్యాను గుర్తుపై ప్రజలందరూ ఓటు వేసి వైఎస్సార్ సీపీ జెండాను మంగళగిరి నియోజకవర్గంలో రెపరెపలాడిద్దామని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి (ఆర్కే), మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం దుగ్గిరాల మండలంలోని ఈమని, నల్లమేకలవారి పాలెం, చుక్కపల్లివారి పాలెంలో వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్యకు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీ ఇవ్వాలని ప్రచారం చేశారు. ముందుగా ఈమని, నల్లమేకల వారి పాలెంలో శ్రీకృష్ణ మందిరం, పలు దేవాలయాల్లో, చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. మురుగుడు లావణ్యకు గ్రామంలోని మహిళలు హారతులు ఇచ్చి, స్వాగతం పలికారు. ప్రధాన రహదారుల్లో రోడ్ షో నిర్వహించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కేలతో కలసి ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గం ప్రజలు ఎప్పుడూ వైఎస్సార్ సీపీనే ఆశీర్వదిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎక్కువ మంది ఉండడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ వర్గానికి చెందిన వారికే రాజ్యాధికారం ఇవ్వాలనే ఉద్దేశంతో ఓసీ అభ్యర్థి అయిన తనను తొలగించి, మురుగుడు లావణ్యకు టికెట్ కేటాయించారన్నారు. ఒక బీసీ అభ్యర్థి ఇక్కడ పోటీ చేయడంతో ప్రతిపక్ష ప్రత్యర్థి నారా లోకేష్ బీసీ అభ్యర్థే కదా అనే చులకన భావంతో చూస్తున్నారన్నారు. మురుగుడు లావణ్యను గెలిపిస్తే గతంలో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, అధికారులు ఏ విధంగా అందుబాటులో ఉన్నారో అదేవిధంగా సేవలు అందిస్తారన్నారు. లావణ్యను సామాన్య ప్రజలు ఏ సమయంలో అయినా కలిసే అవకాశం ఉంటుందన్నారు. సమస్యలను ఆమెకు వివరించుకోచ్చని చెప్పారు. ఇక్కడ పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి దగ్గరకు వెళ్లాలంటే వంద మందిని దాటుకుని వెళ్లాల్సి వస్తుందని వివరించారు. వైఎస్సార్ సీపీ 2019లో అధికారం చేపట్టిన తర్వాత దుగ్గిరాల మండల పరిధిలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి జరిగిందని, ప్రధాన రహదారులను నిర్మించామని, రైతులు పంట పొలాలకు వెళ్లే డొంక రోడ్లను సర్వే చేయించి, ఆక్రమణలు తొలగించి గ్రావెల్ రోడ్లు నిర్మించినట్లు ఆర్కే వివరించారు. వైఎస్సార్ సీపీ ఎన్నికల గుర్తు ఫ్యాన్‌పై తమ అమూల్యమైన ఓటు వేసి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యను, ఎమ్మెల్యే అభ్యర్థిని మురుగుడు లావణ్యను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), జిల్లా సభ్యుడు వడ్డేశ్వరపు రజనీకాంత్, మండల అధ్యక్షుడు శృంగారపాటి రత్నం, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, మైనార్టీ సెల్ నాయకులు షేక్ సుభాని, ఎస్సీ సెల్ నాయకులు వీరయ్య, ఎంపీటీసీలు కొండూరు సుభాని, సర్పంచ్‌లు బాణావత్ ఖుషీబాయి, ఉన్నం ఝాన్సీరాణి, ఇత్తడి రమేష్‌బాబు, దాసరి సుందరమ్మ, యార్లగడ్డ శ్రీచంద్ర దుర్గా భవాని, గంపల గంగాధరరావు, షేక్ అజీజున్, షేక్ జానీబాషా, వైఎస్సాఆర్ సీపీ నాయకులు ఏమినేని రవీంద్ర, ధనుంజయ్, యార్లగడ్డ చిన్ని, పిల్లి ధర్మరత్నం, గేలం ఫణీంద్ర, ఉన్నం రమేష్, ఆత్మకూరు నాగేశ్వరరావు, ఎండి బాజీ, షేక్ నాగూర్, ఆలపాటి వెంకటరావు, కాబోతు కర్ర్యారావు, నూతక్కి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో హుషారు..!



9వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ కౌన్సిలర్ అబ్బు



2వ వార్డులో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో వైఎస్సార్ సీపీ ఉండవల్లి అధ్యక్షుడు దంటు గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. పోలకంపాడు, ఉండవల్లి హరిజనవాడ కరకట్ట, బాపనయ్య నగర్‌లో భారీగా పాదయాత్ర చేసుకుంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ శుక్రవారం పాదయాత్ర కొనసాగింది. దంటు గోవర్ధన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అనిల్ తదితరులు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. గుంటూరు వైఎస్సార్ సీపీ ఎంపీ కిలారి వెంకట రోశయ్యను, మంగళగిరి అభ్యర్థి మురుగుడు లావణ్యను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్ రాజధాని ప్రాంతంలో భూమి కౌలు చెల్లించడంతో పాటు రూ.2,500 పెన్షన్‌ను రూ.5 వేలు చేశారని గుర్తు చేశారు. ఉండవల్లి జేసీఎస్ కన్వీనర్ అనిల్, కళ్ళం పిచ్చిరెడ్డి, బుల్లిబాబు, నక్కా ఆనంద్‌బాబు, తోక సత్యనారాయణ, రాజేష్, కళ్ళం సాంబిరెడ్డి, కళ్ళం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

తాడేపల్లి పట్టణ పరిధిలో..

తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు, డోలాస్ నగర్, బైపాస్ రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రాంతాల్లో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, జేసీఎస్ పట్టణ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ మాచర్ల అబ్బు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డోలాస్ నగర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ప్రభుత్వం వలన పొందిన లబ్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో కళ్ళం రాజశేఖరరెడ్డి, దుర్గగుడి బోర్డు మెంబర్ జక్కిరెడ్డి కృష్ణారెడ్డి, శ్రీకాంత్, విద్యాధర్‌రెడ్డి, వేముల శివ, హరినాథ్, వెంకటేశ్వర్లు, బూత్ కన్వీనర్ ఎనుముల అరుణ, అంబటి పద్మజ, పెరవలి నాజర్ కుమార్, నేలపట్ల ఆనందరావు, అత్యాల దేవరాజు, పెరవలి నాని, అత్యాల క్రాంతికుమార్, అత్యాల నాని, కె.నారసరమ్మ పాల్గొన్నారు.

71 నామినేషన్ల ఆమోదం

- ఐదు నామినేషన్ల తిరస్కరణ
- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి జి.రాజకుమారి



మాట్లాడుతున్న ఆర్వో జి.రాజకుమారి, పరిశీలకులు నీరజ్‌కుమార్, రాధానాథ్ పురోహిత్

మంగళగిరి: మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన 71 నామినేషన్లను ఆమోదించడంతో పాటు ఐదు నామినేషన్లను తిరస్కరించడం జరిగిందని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి జి.రాజకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో నామినేషన్ల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 44 మంది అభ్యర్థులు 76 నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకుడు నీరజ్‌కుమార్, ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాధానాథ్ పురోహిత్ పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఇంజినీరింగ్ ప్రవేశాలు ప్రారంభం



విద్యార్థి మలోజి అనీ స్పందనకు ప్రవేశపత్రాన్ని అందజేస్తున్న వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్, వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ, హైదరాబాద్ క్యాంపస్‌లో ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభించారు. జాతీయస్థాయిలో నిర్వహించిన కేఎల్‌యూ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ కేఎల్‌యూ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల్లో జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన శెట్టిపల్లి జుహి నందన, మలోజి అనీ స్పందనలకు కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీటు కేటాయించడంతో పాటు నాలుగు సంవత్సరాల పాటు నూరు శాతం ఫీజు రాయితీ ఇచ్చినట్లు చెప్పారు. విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో మూడు విడతలుగా జాతీయస్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు వెల్లడించారు. ఇంజినీరింగ్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కేఎల్‌యూ కౌన్సెలింగ్- 2024 కమిటీ చైర్మన్ డాక్టర్ ఎ.జగదీష్ మాట్లాడుతూ మెరిట్ విద్యార్థులకు ఫీజు రాయితీ కల్పిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు వచ్చిన ర్యాంకులు, ఇంటర్‌లో వచ్చే మెరిట్ మార్కులు, జేఈఈ మెయిన్స్ ర్యాంకుల ఆధారంగా వారు కోరుకున్న విభాగాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్ డాక్టర్ టి.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

పెదకాకాని: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. పెదకాకాని పాతూరు ఏరియాకు చెందిన షేక్ ముస్తాఫా వంట పనికి, గ్రామంలోని టుబాకో కంపెనీలో కూలీగా వెళ్తూ.. జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున మోటార్‌తో నీళ్లు పట్టాడు. అనంతరం స్విచ్ ఆఫ్ చేసే సమయంలో కరెంట్ షాక్ తగిలి అక్కడే పడిపోయాడు. కుటుంబ సభ్యులు స్థానికంగా ప్రాథమిక చికిత్స అందించి, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే షేక్ ముస్తాఫా(32) మరణించాడు. మృతునికి భార్య మెహరున్నీసా, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

లారీ ఢీకొని ఒకరి మృతి



మృతిచెందిన ఎం.శ్రీనివాసరావు

మేడికొండూరు: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందగా, మరొకరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రమైన మేడికొండూరు జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని బ్రిడ్జి వద్ద జరిగింది. గుంటూరు నుంచి సత్తెనపల్లి వైపు వెళ్తున్న లారీ, సత్తెనపల్లి నుంచి గుంటూరు వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఎం.శ్రీనివాసరావు (45) తీవ్రగాయాలపాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అతని అత్త గుడిపూడి కౌశల్యకు స్వల్ప గాయాలు కాగా, స్థానికులు గమనించి క్షతగాత్రురాలిని ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన ఉండాలి



నెహ్రూ నగర్: ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు ఈవీఎంల వినియోగంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులు కేటాయించబడిన ఇంజినీరింగ్ అధికారులకు ఎన్నికల ప్రాసెస్, ఈవీఎంల నిర్వహణపై డెమో ఈవీఎంల ద్వారా శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల పని తీరుపై ఇంజినీరింగ్ అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్లు కమిషనింగ్, పోల్ సమయంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారం చేసేలా సిద్ధమవ్వాలన్నారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు తప్పనిసరిగా ఎన్నికల ప్రాసెస్‌పై అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల రోజు ఈవీఎంల్లో ఏ సమస్య ఎదురైనా తక్షణం పరిష్కారం చేసేలా శిక్షణ పొందాలన్నారు. శిక్షణలో ఏఆర్ఓ సునీల్ కుమార్, ఈఈ సుందర్‌రామిరెడ్డి, మేనేజర్ ఎస్.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో డెప్యూటీ కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు

గుంటూరు మెడికల్: రాబోయే రోజుల్లో గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి పరిపాలన విభాగం అటు ప్రజలకు, ఇటు వైద్యేతర సిబ్బందికి మరింతగా సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. ఆస్పత్రిలో ఏఓ కార్యాలయాన్ని మరమ్మతులు చేసి డెప్యూటీ కలెక్టర్ కార్యాలయంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ పరిపాలన విభాగంలో అనేక సంస్కరణలు వచ్చాయని అందులో భాగంగా పరిపాలన సౌలభ్యం కోసం మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రిని ఒక యూనిట్‌గా తీసుకున్నారని చెప్పారు. ఇక నుంచి మెడికల్ కళాశాలకు, ఆసుపత్రికి ఒక పరిపాలన విభాగం అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులను నిర్వర్తిస్తారని తెలిపారు. వీరిని పర్యవేక్షణ బాధ్యత డెప్యూటీ కలెక్టర్‌కు అందచేశారన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు డెప్యూటీ కలెక్టర్ రిపోర్ట్ అందిస్తారని వివరించారు. డెప్యూటీ కాల్ లెటర్ హోదా పెరగడం వలన పరిపాలన విభాగం బలోపేతమవ్వడమే కాకుండా ఆసుపత్రి సిబ్బందికి సేవలు వేగవంతం అవుతాయని చెప్పారు. వైద్య సిబ్బంది ఫైళ్లు పెండింగు లేకుండా చేసే అవకాశం ఉంటుందన్నారు. డెప్యూటీ కలెక్టర్ విధి విధానాలు కూడా ప్రకటించారని చెప్పారు.

సంక్షేమ రథసారథి వైఎస్ జగన్

- తాడికొండ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేకతోటి సుచరిత
- అమీనాబాద్, హౌస్‌గణేష్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



స్థానిక మహిళలతో మమేకమైన అభ్యర్థి మేకతోటి సుచరిత

ఫిరంగిపురం: సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తాడికొండ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత అన్నారు. మండలంలోని అమీనాబాద్, హౌస్ గణేష్ గ్రామాల్లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ప్రసిద్ధి చెందిన మూలాంకురేశ్వరి అమ్మవారి అలయంలో పూజలు నిర్వహించి, ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరినీ పలకరించారు. సంక్షేమ పథకాల లబ్ధి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుచరిత మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాయన్నారు. సీఎం వైఎస్ జగన్ తన పాదయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకుని, పేద, బడుగు, బలహీన వర్గాలవారికి లబ్ధి చేకూరేలా అనేక పథకాలు అమలు చేశారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించారని చెప్పారు. అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు , పురుగు మందులు, ఎరువులు అందించడమే కాకుండా పంటకు మద్దతు ధర లభించేలా చేశారని గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి, అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, మాజీ జెడ్పీటీసీ నన్నం సునీత, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పాలపాటి రఘు, బద్దూరి శ్రీనివాసరెడ్డి, గాంధీ బుడే, చేవూరి రామమోహన్‌రెడ్డి, మీరా, పి.బాబురావు, కె.ఆనంద్, ఎ.రత్నం, ఐజాక్, అప్పిరెడ్డి, చౌడయ్య, డి.నరేంద్రకుమార్, రఫి, మీరా, కరిముల్లా, ఇస్మాయిల్, బి.మల్లికార్జునరావు, టి.కృష్ణ, పి.చిన్న, రామారావు, వీరారెడ్డి, మస్తాన్‌రెడ్డి, కె.వీరయ్య, జోసఫ్, తిరుపతయ్య, కృష్ణారెడ్డి, బ్రహ్మారెడ్డి, రోశయ్య, ఈశా మాష్టారు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు ప్రాణం పోయాలి

- రాపోర్, గౌహతి ఐఐటీ డైరెక్టర్ ఆచార్య రాజీవ్ అహుజ
- ఘనంగా ఎస్ఆర్ఎం 8వ రీసెర్చ్ డే వేడుకలు
- ఐదుగురు ప్రొఫెసర్లకు ఉత్తమ పరిశోధన అవార్డులు



జ్యోతి ప్రజ్వలనగావిస్తున్న ఆచార్య రాజీవ్ అహుజ, వీసీ మనోజ్

మంగళగిరి: యువ పరిశోధకులు, రీసెర్చ్ స్కాలర్లు నూతన సృజనతో ముందుకు రావాలని, కొత్త ఆవిష్కరణలకు ప్రాణం పోయాలని రాపోర్, గౌహతి ఐఐటీ డైరెక్టర్, శాస్త్రవేత్త ఆచార్య రాజీవ్ అహుజ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 8వ రీసెర్చ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన సభలో విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. దేశంలో ఐఐటీల ఉన్నతికి ప్రధాన కారణం పరిశోధనలేనన్నారు. పరిశోధన రంగంలో కాలు మోపుతున్న రీసెర్చ్ స్కాలర్లు సమూహంగా ఏర్పడి పరస్పరం తమ ఆలోచనలను చర్చించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లోనూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ప్రవేశ పెడుతుందని, దీని వల్ల మరింత సత్ఫలితాలు లభిస్తాయన్నారు. విశిష్ట అతిథి కోల్‌కతా యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ అమ్లాన్ చక్రవర్తి జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోరా యూనివర్సిటీ ప్రగతిని, పరిశోధనలకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా పరిశోధనల్లో పురోగతి సాధిస్తున్న ఐదుగురు ప్రొఫెసర్లకు యూనివర్సిటీ యాజమాన్యం ప్రత్యేక అవార్డులను ప్రకటించింది. అవార్డు కింద ఒక్కొక్కరికీ రూ. 50వేల నగదు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్, రీసెర్చ్ డే కన్వీనర్ డాక్టర్ ప్రత్యూతకుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధి నూతక్కి, చిర్రావూరు, రామచంద్రాపురం, పెదవడ్లపూడి, కాజ ప్రాంతాల్లో శనివారం ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లేన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, కావున ఆయా ప్రాంత వినియోగదారులు గమనించి సహకరించాలని పేర్కొన్నారు.

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లేన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నులకపేట, పీవీ నగర్, రాజీవ్ కాలనీ, జగ్జీవన్‌రావు కాలనీ, ఇస్లాంపేట, ప్రకాష్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని పేర్కొన్నారు.

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఎస్.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదపాలెం సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం రేవేంద్రపాడు, శృంగారపురం, తుమ్మపూడి, పెదపాలెం, పెరికపలూడి, చినపాలెం, వీర్లపాలెం, పెదకొండూరు, గొడవర్రు గ్రామాల్లో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందన్నారు. పెరికలపూడి, చినపాలెం, పెదపాలెం గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

అత్యంత ఆసక్తిగా ప్రదర్శిస్తున్న నృత్యాలు

భక్తి పారవశ్యంలో ముంచెత్తిన విప్రనారాయణ చరిత్ర



విప్రనారాయణ చరిత్రలో ఓ సన్నివేశం

నగరంపాలెం: అంతర్జాతీయ నృత్య దినోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 23న ప్రారంభమైన నృత్య ప్రదర్శనలు సభికులు, ప్రేక్షకులను అలరిస్తున్నాయి. పలు రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శిస్తున్న నృత్యాలు ఆకట్టుకుంటున్నాయి. శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తున్న వేడుకలు శుక్రవారం నాలుగో రోజుకి చేరాయి. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేయగా, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. 17వ శతాబ్దపు పాలకుడు శ్రీ విజయ రాఘవ నాయకుడు రచించిన 'విప్రనారాయణ చరిత్ర' యక్షగానం ప్రేక్షకులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. డాక్టర్ కాజ వెంకటసుబ్రహ్మణ్యం నృత్య దర్శకునిగా, విప్రనారాయణుని శిష్యునిగా, సూత్రధారిగా, విప్రనారాయణునిగా తేరల శ్రావణ్‌కుమార్, దేవ దేవిగా పటకమూరి సుప్రియ, దేవ దేవి తల్లిగా పూల భరణి, సోదరిగా పచ్చల నాగమహిత, విజయ రాఘవనిగా నాత్యాచార్య బాలు, రంగ మన్నారుగా అక్షయరెడ్డి, రాజా నర్సకి మనులుగా నారా హర్షిని, జమ్ముల కుసుమాంజలి, కె.తన్మయశ్రీ, గరికపాటి శ్రీ అన్నయ్య, ఆదిరాజు కృత్తిక, తంజావూరు నర్తకిగా తాళ్లూరి ధరణి అద్భుతంగా తమ పాత్రలను పోషించారు. కార్యక్రమాన్ని ఈశ్వర వరప్రసాద్ పరిషత్తు(గుంటూరు) సమర్పించగా, ప్రముఖ చిత్రకారులు రాయన గిరిధర్ గౌడ్ తో పాటు వెంకటగిరి నాగలక్ష్మి, మోదుగుల రవికృష్ణ పాల్గొన్నారు.